క్లుప్తంగా

వాటర్ కూలర్ బహూకరణ



ఉదయగిరి: మండలంలోని బిజ్జంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు దాత ఎస్ఎం బాషా వాటర్ కూలర్‌ను శనివారం బహూకరించారు. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థంగా వాటర్‌కూలర్‌ను అందజేసినట్లు ఆయన తెలిపారు.

సర్పంచ్‌కు సన్మానం



ఉదయగిరి: మండలంలోని దాసరిపల్లి సర్పంచ్ సయ్యద్ గౌస్‌మొయిద్దీన్ మక్కాయాత్రను విజయవంతంగా పూర్తిచేసుకుని వచ్చిన సందర్భంగా మండల వైఎస్సార్‌సీపీ నాయకులు శనివారం సన్మానించారు. పార్టీ మండలాధ్యక్షుడు జీ ఓబులరెడ్డి, జీ శ్రీనివాసరెడ్డి, గడియాల్చి యస్దాని, నారపరెడ్డి, హరి, రామరాజు, ఓబులరెడ్డి, అక్కులరెడ్డి, మర్తుజాహుస్సేన్ పాల్గొన్నారు.

బాధితురాలికి చేయూత



కలిగిరి: కలిగిరిలో రెండ్రోజుల క్రితం జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన వృద్ధురాలు నాటకరాణి రమణమ్మకు మండల రెడ్‌క్రాస్ బృందం శనివారం చేయూతనందించింది. రెడ్‌క్రాస్ మండలాధ్యక్షుడు ఆవుల శ్రీనివాసులురెడ్డి నిత్యావసర సరుకులు సమకూర్చారు. పాలూరు మాలకొండారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆయన కుమారుడు పాలూరు కొండారెడ్డి రూ.5వేలు నగదు అందజేశారు. రెడ్‌క్రాస్ సభ్యులు ఆవుల ప్రభాకర్‌రెడ్డి, గంజాం పోలయ్య, మస్తాన్ పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



ఆత్మకూరురూరల్: కరటంపాడు పంచాయతీ పరిధిలోని శ్రీనివాసపురం ఎంపీపీఎస్ పాఠశాల వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఆత్మకూరు ఎంఈఓ చలపతి ముఖ్యఅతిథిగా హాజరై ప్రతిభావంతులైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. హెచ్ఎం కొండారెడ్డి, ఉపాధ్యాయిని బేబినమ్రతను అభినందించారు. సర్పంచ్ రేవతి, మాజీ ఎంపీటీసీ గార్లపాటి వేణుగోపాల్‌నాయుడు, స్థానిక నాయకులు పెంచలరావు, ధనుంజయ పాల్గొన్నారు.

ఎంపీడీఓకు మాతృవియోగం

వరికుంటపాడు: మండల ఎంపీడీఓ గొట్టిపాటి వేణుగోపాల్‌రావు తల్లి పద్మావతమ్మ (84) శనివారం మరణించారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె నెల్లూరులోని హరినాథపురంలోని నివాసంలో మృతి చెందారు. ఆమె పార్థివ దేహాన్ని ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది సందర్శించి నివాళులర్పించారు.

పాఠశాలలో చోరీ

సోమశిల: అనంతసాగరం మండలం మినగల్లు ఎస్సీకాలనీ పాఠశాలలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. పాఠశాలలోని 15 కుళాయిలను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకెళ్లారు. శనివారం ఉదయం గుర్తించిన హెచ్ఎం వెంకటేశ్వర్లు ఉపాధ్యాయులతో కలిసి అనంతసాగరం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

అల్లూరు: స్థానిక ఆర్డీఆర్ కాలనీలోని బీసీ గురుకుల పాఠశాలలో 2025-26 విద్యాసంవత్సరంలో ఐదో తరగతి ప్రవేశానికి విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ లక్ష్మీప్రసన్న శనివారం తెలిపారు. ఐదోతరగతిలో 40 సీట్లు ఉన్నాయని చెప్పారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో నాల్గో తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు మార్చి 15వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

చెత్తలో చిక్కీలు

ఉదయగిరి: మండలంలోని గుడినవరలో పాఠశాల విద్యార్థులకు అందజేసే వేరుశనగ చిక్కీలు చెత్తకుప్పలో దర్శనమిచ్చాయి. శనివారం చెత్తలోని చిక్కీల ప్యాకెట్‌ను కుక్కలు చీలుస్తుండగా స్థానికులు గమనించి పరిశీలించగా కాలం చెల్లిఉన్నాయి. విద్యార్థులకు ఇవ్వకుండా నిర్లక్ష్యం వహించి కాలం చెల్లిన తరువాత చెత్తలో పడేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఇఫ్తార్ విందు

చేజర్ల: స్థానిక జామియా మసీదులో ముస్లింలకు స్థానిక ఆర్యవైశ్యుడు దేవతి రమేష్‌బాబు ఇఫ్తార్ విందును శనివారం అందజేశారు. తన సన్నిహితుడైన మైనార్టీ నాయకుడు సిరాజుద్దీన్ సహకారంతో ఇఫ్తార్ విందును అందజేశారు.

విద్యతోనే మహిళా సాధికారత

కావలి : విద్యతోనే మహిళా సాధికారత సాధ్యమని కావలి ఆర్డీఓ ఎం సన్నీవంశీకృష్ణ పేర్కొన్నారు. కావలి ఆర్డీఓ కార్యాలయ ప్రాంగణంలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాల సముదాయంలో రెడ్‌క్రాస్, టీం సేవియర్స్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్డీఓ వంశీకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థినులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యతో పేదరికాన్ని జయించొచ్చని పేర్కొన్నారు. సాంఘిక సంక్షేమ వసతి గృహ విద్యార్థినులకు తాను ఆర్డీఓగా, రెడ్‌క్రాస్ అధ్యక్షుడిగా అండగా ఉంటానన్నారు. ఏ సమస్య వచ్చినా రెడ్‌క్రాస్ భవనంలో సంప్రదించాలని సూచించారు. అనంతరం 139 మంది విద్యార్థినులకు దుస్తులు పంపిణీ చేశారు. వసతిగృహ అధికారిణులు ప్రసన్న విజయలక్ష్మి, సునీత, మంజులను ఆర్డీఓ సత్కరించారు. రెడ్‌క్రాస్ చైర్మన్ డీ రవిప్రకాష్, వైస్‌చైర్మన్ కే హరినారపరెడ్డి, సభ్యులు ఇలీంద్ర శ్రీవాణి, ఎం పార్వతిశంకర్, ఎస్కే నయీం, టీం సేవియర్స్ సభ్యులు ప్రణీత్, సౌందర్య, దీపిక, తదితరులు పాల్గొన్నారు.

స్త్రీలు శక్తికి ప్రతిరూపాలు

స్త్రీలు శక్తికి ప్రతిరూపాలని, ఎక్కడ స్త్రీలకు స్వేచ్ఛ, సమానత్వం, గౌరవం లభిస్తుందో ఆ సమాజం అన్ని రంగాల్లో విలసిల్లుతుందని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కావలి రెడ్‌క్రాస్ భవనంలో మహిళా స్వచ్ఛ సారథులను ఎమ్మెల్యే చేతుల మీదుగా సత్కరించారు. 200 మంది మహిళా కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంపన్నులు, విద్యావంతులు వీధులను అపరిశుభ్రం చేస్తుంటే పారిశుధ్య కార్మికులు పరిశుభ్రం చేసి రోగాల బారిన పడకుండా కాపాడుతున్నారని, వారి సేవలు ఎనలేనివన్నారు. కావలి ఆర్డీఓ,రెడ్‌క్రాస్ అధ్యక్షుడు ఎం వంశీకృష్ణ, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ అలేఖ్య, బచ్చు వీరాస్వామి, రెడ్‌క్రాస్ బాధ్యులు బెజవాడ రవికుమార్, డీ రవిప్రకాష్, కే హరినారపరెడ్డి, ఆరికట్ల మధుసూదన్‌రావు, డాక్టర్ పీ శ్రీధర్, యం పార్వతి శంకర్, ఇలింద్ర శ్రీవాణి, గొట్టిపాటి మనోరమ పాల్గొన్నారు.

మహిళా పోలీసులకు సన్మానం

మహిళా దినోత్సవం సందర్భంగా కావలి రూరల్ పోలీస్ స్టేషన్‌లో కావలి రూరల్ సీఐ జీ రాజేశ్వరరావు, ఎస్సైలు బాలకృష్ణ, తిరుమలరెడ్డి, బాజీబాబు మహిళా పోలీసులను ఘనంగా సత్కరించారు.

ఉపాధ్యాయినులకు సన్మానం

పట్టణంలో శ్రీసాయి డిగ్రీ కళాశాలలో స్టేట్ టీచర్స్ యూనియన్(ఎస్టీయూ) ఆధ్వర్యంలో 20 మంది ఉపాధ్యాయినులను సన్మానించారు. ఒట్టూరు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ ఇందిర, కావలి జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం ఏబీ నీరజ, అడ్వొకేట్ శ్రీదేవి, కేజీబీవీ ప్రిన్సిపల్ సంధ్యారాణి, మేరీ మంజుల, హెప్సి సైమన్, ఎస్టీయూ నాయకులు అశోక్ కుమార్, ఎం సుదర్శనం, రాజు, సురేష్, సునీల్, రవి, ఖాదర్‌బాషా, మోజెస్‌రాజకుమార్ పాల్గొన్నారు.



కావలి: వసతిగృహ విద్యార్థినులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఆర్డీఓ వంశీకృష్ణ

వింజమూరు(ఉదయగిరి): వింజమూరులోని ఐకేపీ భవనంలో పొదుపు సిబ్బందికి వివధ రకాల పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందజేశారు. అలాగే వింజమూరులోని మాశిలామణి వైద్యశాలలో ఉత్తమ మహిళగా గణపం హరితను గుర్తించి సన్మానించారు. ఈ సందర్భంగా విశ్రాంత డీఎంహెచ్ఓ మాశిలామణి మాట్లాడుతూ నేడు మహిళలు అన్ని రంగాల్లో ముందుకు దూసుకెళుతున్నారన్నారు. అయినా ఇంకా సమాజంలో స్త్రీజాతిపై వివక్షత కొనసాగుతోందని, దానిని రూపుమాపే ప్రయత్నం చేయాలన్నారు.

ఉదయగిరి : పట్టణంలోని పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో అంగన్‌వాడీ, ఆవాజ్, యూటీఎఫ్ సంఘాల ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన మహిళలను సన్మానించారు. వివిధ సంఘాల మహిళానేతలు ప్రమీలదేవి, వాణి, సువార్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

అల్లూరు: గిరిజన మహిళలు అన్ని రంగాల్లో రాణించి జీవితాల్లో వెలుగులు నింపుకోవాలని మైక్రో ఇరిగేషన్ పీడీ శ్రీనివాస్, డ్వామా డీడీఎం బాబు, ఏఆర్డీ డైరెక్టర్ బషీర్ పిలుపునిచ్చారు. అల్లూరులోని రామకృష్ణ డిగ్రీ కళాశాల మైదానంలో నాబార్డ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకలకు వారు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు.మహిళా సాధికారతతోనే కుటుంబం, సమాజం అభివృద్ధి చెందుతాయన్నారు. గిరిజన మహిళలు విద్యను అభ్యసించడంతో పాటు స్థానికంగా లభ్యమయ్యే సహజ వనరులను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని పిలుపునిచ్చారు. హౌసింగ్ ఈఈ మాధవ్‌రావు, జిల్లా కోఆపరేటివ్ బ్యాంక్ మేనేజర్ లలిత, ఎంపీడీఓ రజనీకాంత్, గిరిజన మహిళా నేత సత్యవతమ్మ పాల్గొన్నారు.

మహిళలు ధైర్యంగా ఉండాలి

ఆత్మకూరు: మహిళలు ప్రతి విషయానికి బెంబేలెత్తకుండా ధైర్యంగా ఉండాలని, అదే వారికి శ్రీరామరక్ష అవుతుందని ఆత్మకూరు కోర్టు సీనియర్ సివిల్ జడ్జి బీ గాయత్రి అన్నారు. ఆత్మకూరు కోర్టులో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకలకు జడ్జి గాయత్రి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. చిన్న వయస్సు నుంచే సమాజాన్ని గమనిస్తూ చెడుచేసే వాళ్లను దూరంగా ఉంచాలన్నారు. సమాజసేవకు సమయం కేటాయించాలని సూచించారు. మహిళలు తలచుకుంటే ఏదైనా సాధించగలరన్న విషయాన్ని నిరూపించాలని ఆమె కోరారు. జూనియర్ సివిల్ జడ్జి ఎల్ జగదీష్‌కుమార్, బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు ఎల్‌వీ రమణయ్య, తిరుపతమ్మ పాల్గొన్నారు.

మహిళలు అవకాశాలను అందిపుచ్చుకోవాలి

మహిళలు పురోభివృద్ధి సాధించేందుకు ఎన్నో ప్రోత్సాహక పథకాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని అందిపుచ్చుకుని అభివృద్ధి సాధించాలని ఆత్మకూరు డీఎస్పీ కే వేణుగోపాల్ అన్నారు. పట్టణంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో డీఎస్పీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్మకూరు ఆర్టీసీ డిపో మేనేజర్ కరీమున్నీసా, అర్బన్ హెల్ సెంటర్ డాక్టర్ షేక్ అస్మా, ఏపీ బాలికల పాఠశాల ప్రిన్సిపల్ కామేశ్వరి, అధ్యాపకురాలు సుమ, తదితరులను శాలువాలతో సన్మానించారు. అనంతరం 'సమాజంలో మహిళల పాత్ర' అన్న అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ జీ గంగాధర్, ఎస్సైలు ఎస్‌కే జిలానీ, సాయిప్రసాద్, పోలీస్ సిబ్బంది, సచివాలయాల మహిళా పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

చేజర్ల: పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. చేజర్లలోని వెలుగు కార్యాలయంలో నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. నేటి ఆధునిక సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. చిన్నప్పటి నుంచి మహిళలు పురుషులతో సమానంగా చదివి ఉన్నతస్థితికి చేరాలన్నారు. భర్తకు చేదోడుగా ఉంటూ కుటుంబానికి సహకారం అందించాలన్నారు. అనంతరం మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మురళి, ఎంపీడీఓ విజయలలిత, వెలుగు ఏపీఎం సృజన, టీడీపీ నాయకులు రావి లక్ష్మీనరసారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

కలిగిరి: స్థానిక కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలో నిర్వహించిన మహిళా దినోత్సవం వేడుకలకు ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, ప్రవీణ దంపతులు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కాకర్ల సురేష్ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా పరిపుష్టి సాధించి అన్ని రంగాల్లో ముందజలోకి రావాలన్నారు. అనంతరం విద్యార్థినులతో కలిసి భోజనాలు చేశారు. ఎంఈఓ సురేష్, ప్రిన్సిపల్ సుప్రియ, టీడీపీ మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి, సర్పంచ్ దేవనబోయిన వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

మర్రిపాడు: డీసీపల్లిలోని పంచముఖ శక్తి గణపతి దేవస్థానం వద్ద మహిళలకు ముగ్గులు, లెమన్ అండ్ స్పూన్ పోటీలు నిర్వహించారు. ఆత్మకూరు ఎంపీఐ రాములు విజేతలకు బహుమతులను అందజేశారు. అనంతరం స్ఫూర్తిదాయకంగా సేవలందిస్తున్న ప్రభుత్వ మహిళా ఉద్యోగులను సత్కరించారు. డాక్టర్ కిన్నెర కిషోర్ దంపతులు, చింతలపల్లి మధుసూదన్‌శర్మ, పాసర్లపూడి వెంకటేశ్వరశర్మ పాల్గొన్నారు.

సోమశిల: అనంతసాగరం పీహెచ్‌సీలో వైద్యులు శ్రీకాంత్‌రెడ్డి, శ్రావణి ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులను సన్మానించారు. ఉత్తమ సేవలను అందజేస్తున్న ఆరోగ్య సిబ్బందికి అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.



ఆత్మకూరు: మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి బీ గాయత్రి



ఆత్మకూరు పోలీసు స్టేషన్‌లో మహిళా ఉద్యోగులను సన్మానిస్తున్న డీఎస్పీ



కావలి: రెడ్‌క్రాస్‌లో మహిళా పారిశుధ్య కార్మికులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి



కలిగిరి:ఎమ్మెల్యే కాకర్ల దంపతులకు స్వాగతం పలుకుతున్న కేజీబీవీ విద్యార్థినులు



అనంతసాగరం పీహెచ్‌సీలో అవార్డుల ప్రదానం



మర్రిపాడు: మహిళా ఉద్యోగులకు సత్కారం



కావలి రూరల్ పోలీసుస్టేషన్‌లో మహిళా పోలీసులకు సన్మానం



కావలి: ఉపాధ్యాయినులకు సన్మానం



అల్లూరు: మాట్లాడుతున్న ఏఆర్డీ డైరెక్టర్ బషీర్



వింజమూరులోని మాశిలామణి ఆస్పత్రిలో..



ఉదయగిరిలోని సుందరయ్య భవనంలో..

ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రజాచైతన్య యాత్ర

కావలి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజలను చైతన్యవంతం చేయడంతో పాటు ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రజాచైతన్య యాత్రను నిర్వహిస్తున్నట్లు సీపీఎం నాయకులు తెలిపారు. మండలంలోని బైనేటివారిపాళెం, కట్టకింద పాళెం, ఆనెమడుగు, చెన్నాయపాళెం, పెద్దపట్టపుపాళెం, గుమ్మడి బొందల, గౌరవరం, తదితర గ్రామాల్లో సీపీఎం ఆధ్వర్యంలో ప్రజాచైతన్య యాత్రను శనివారం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై ప్రచారం చేశారు. బీపీసీఎల్, సోలార్ కంపెనీలతో నష్టపోయే భూనిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల పండించిన ధాన్యానికి మద్దతు ధర కల్పించాలని కోరారు. స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును విరమించుకోవాలని, ట్రూఆఫ్ చార్జీలను రద్దు చేయాలని, ప్రజలపై మోపుతున్న రూ.1.25 లక్షల కోట్ల పన్నుల భారాన్ని తొలగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బోగోలు, జలదంకిలో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుల నిర్మాణాలను త్వరితగతిగా పూర్తిచేసి తాగునీటి ఎద్దడిని నివారించాలని డిమాండ్ చేశారు. సీపీఎం సీనియర్ నాయకులు తాళ్లూరు మాల్యాద్రి, కేవీపీఎస్ జిల్లా కమిటీ సభ్యులు కే జాను, పార్టీ ప్రాంతీయ కమిటీ సభ్యులు అడపాల సురేష్, సీఐటీయూ నాయకులు మస్తాన్, గుడిపల్లి వెంకట్రావు, ప్రసాద్ పాల్గొన్నారు.



ఆనెమడుగులో ప్రజలతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

లోక్‌అదాలత్‌లో కేసులు సత్వరమే పరిష్కారం

కావలి: లోక్‌అదాలత్‌లో కేసులను సత్వరమే పరిష్కరించడం జరుగుతుందని లోక్‌అదాలత్ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి ఎం శోభ పేర్కొన్నారు. కావలి సబ్ కోర్టు ఆవరణంలో జాతీయ లోక్ అదాలత్‌ను శనివారం నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి ఎం శోభ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఈ సుధాకర్ కలిసి 10 సివిల్, 4,210 క్రిమినల్ కేసులను పరిష్కరించారు. చెక్‌బౌన్స్ కేసులకు సంబంధించి సుమారు రూ.53,19,701 నగదును బాధితులకు అందించారు. అలాగే బీఎస్ఎన్ఎల్,,బ్యాంకు పీఎల్‌సీ కేసులకు సంబంధించి సుమారు రూ.33,45,659 నగదును రికవరీ చేశారు. కాగా కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు సీనియర్ సివిల్ జడ్జి శోభ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకుని గౌరవప్రదమైన జీవితం గడపాలన్నారు. అనంతరం మహిళా న్యాయవాదులను సత్కరించారు.



కావలి: మాట్లాడుతున్న జడ్జి ఎం శోభ

ఆత్మకూరులో 2159 కేసులు పరిష్కారం

ఆత్మకూరు: ఆత్మకూరు కోర్టులో శనివారం లోక్‌అదాలత్‌ను నిర్వహించారు. జూనియర్ సివిల్‌జడ్జి ఎల్ జగదీష్‌కుమార్‌తో కలిసి సీనియర్ సివిల్ జడ్జి బీ గాయత్రి కేసులను పరిష్కరించారు. సివిల్ 14, క్రిమినల్ 3, బ్యాంకు లావాదేవీలు, చెక్‌బౌన్స్ , డ్రంక్ అండ్ డ్రైవ్, తదితర కేసులు కలిపి మొత్తం 2,159 కేసులను పరిష్కరించినట్లు జడ్జి బీ గాయత్రి తెలిపారు. ఆయా కేసులకు సంబంధించి బాధితులకు సుమారు రూ.31,95,890 నగదును అందజేసినట్లు వివరించారు. బ్యాంకు పీఎల్‌సీ లావాదేవీలకు సంబంధించి రూ.5.25 లక్షలను వసూలు చేసినట్లు తెలిపారు.

గాయపడిన కూలీ మృతి

సోమశిల: ధాన్యం బస్తా మీదపడి గాయపడిన కూలీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు అనంతసాగరం పోలీసులు తెలిపారు. సంగంలోని హరిజనవాడకు చెందిన జగడం పెంచలయ్య కుమారుడు జగడం ప్రభాస్ (25)కు వివాహం కాలేదు. అనంతసాగరం మండలం కొత్తపల్లిలోని బంధువుల ఇంట్లో ఉంటూ ధాన్యం కాటా పనికి వెళ్తున్నాడు. ఈ నెల 3న వెంగంపల్లిలో లారీకి ధాన్యం లోడ్ చేస్తున్న క్రమంలో బస్తా జారిమీద పడడంతో మెడ, వెన్నుపూస దెబ్బతిన్నాయి. తొలుత చికిత్స నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సూర్యప్రకాష్‌రెడ్డి తెలిపారు.

ప్రతిభా పరీక్ష



కలిగిరి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఐదో తరగతి విద్యార్థులకు ప్రతిభా పరీక్షను శనివారం నిర్వహించారు. మొదటి ఐదు స్థానాల్లో నిలిచిన హారికకు రూ.5వేలు, శ్రీవల్లికి రూ. 4వేలు, లక్ష్మీప్రియకు రూ.3వేలు, మేఘసాయికి రూ.2వేలు, మనోహర్‌కు రూ.వేయి చొప్పున నగదును దాతలు చెరుకూరి కొండపనాయుడు, అల్లంపాటి చంద్రశేఖర్, మదన్, శింగంరెడ్డి అనిల్ సహకారంతో అందజేశారు. అందజేశారు. ఎంఈఓ సురేష్‌బాబు, హెచ్ఎం భీమేశ్వరరావు, ఆపస్ నాయకులు పాల్గొన్నారు.

గౌసియాబేగానికి బెస్ట్ అచీవ్‌మెంట్ అవార్డు

ఉదయగిరి: స్థానిక చెక్కనగిషీ కేంద్రం నిర్వాహకురాలు షేక్ గౌసియాబేగానికి అలీప్ సంస్థ బెస్ట్ అచీవ్‌మెంట్ అవార్డు లభించింది. మహిళ దినోత్సవం సందర్భంగా అలీప్ సంస్థ అధ్యక్షురాలు రమాదేవి, నారా భువనేశ్వరి అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమెకు కళాకారులు, కుటుంబ సభ్యులు, సన్నిహితులు అభినందనలు తెలిపారు.

తోలేటి శ్రీకాంత్ నియామకంపై హర్షం

కావలి: రాష్ట్ర వైఎస్సార్‌సీపీ చేతివృత్తిదారుల సంఘం అధ్యక్షుడిగా నియమితులైన తోలేటి శ్రీకాంత్‌ఆచారికి కావలి పట్టణ స్వర్ణకారుల సంఘం మాజీ అధ్యక్షుడు పుత్తూరు నాగఆచారి శనివారం ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌గా తోలేటి శ్రీకాంత్ ఆచారి ఎంతో సేవలు అందించారన్నారు. ఆయనకు రాష్ట్రంలోని చేతివృత్తిదారుల సమస్యలు, కష్టాలు, బాధలు తెలుసునన్నారు. అలాంటి వ్యక్తిని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర పార్టీ చేతివృత్తిదారుల సంఘం అధ్యక్షుడిగా నియమించడం సంతోషకరమన్నారు. చేతివృత్తిదారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తోలేటి కృషి చేస్తారన్నారు.

గ్రామ సచివాలయాల్లో స్పందనకు మంగళం

- గత కొంతకాలంగా నిలిచిన కార్యక్రమం
- మండల, జిల్లా కేంద్రాలకు పరుగులు తీస్తున్న అర్జీదారులు
- ప్రజాసమస్యల పరిష్కారంపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం



సీతారామపురంలోని గ్రామ సచివాలయం

సీతారామపురం: ప్రజలకు జవాబుదారీగా అధికార యంత్రాంగం ఉండాలని, పరిపాలనా సౌలభ్యంతో పాటు ప్రజా సమస్యలను గ్రామస్థాయిలోనే పర్యవేక్షించి పరిష్కరించే నిమిత్తం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామ సచివాలయాల్లో అమలు చేసిన స్పందన కార్యక్రమానికి నేటి కూటమి ప్రభుత్వం మంగళం పాడింది. ప్రస్తుతం గ్రామ సచివాలయాల్లో ఎక్కడా స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దాఖలాలు లేవు. అంతా ఇప్పుడు మండల కేంద్రాలకు మార్చేశారు. అక్కడ అన్ని శాఖల అధికారులు కనిపించకపోగా, అర్జీదారులను పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలు ఎక్కడ ఉంటాయో కూడా తెలియని పరిస్థితి. మండల తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రతి సోమవారం నామమాత్రంగా నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికపై ఎవరికీ స్పష్టంగా అవగాహన లేని పరిస్థితి నెలకొంది.


గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇలా..

గత ప్రభుత్వంలో గ్రామ సచివాలయాల్లో ప్రతిరోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి స్పందన కార్యక్రమాన్ని నిర్వహించే వారు. సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలపై వినతిపత్రాలు స్వీకరించే వారు. వాటిని పరిశీలించి తమ పరిధిలోని వాటిని పరిష్కరించేవారు. మిగిలిన సమస్యలను మండలాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేశారు. దీంతో మండల కేంద్రాలకు పరుగులు తీసే బాధ ప్రజలకు తప్పింది. ప్రజలకు ఆర్థిక భారంతో పాటు సమయం కూడా ఆదా అయ్యేది. ముఖ్యంగా వృద్ధులు, మహిళలకు ఎన్నో ఇబ్బందులు తప్పి సమస్యలు తీరేవి.

కూటమి ప్రభుత్వం వచ్చాక...

కూటమి ప్రభుత్వం వచ్చాక సచివాలయ స్థాయిలో స్పందన కార్యక్రమానికి స్వస్తి పలకడంతో ప్రజలకు మళ్లీ కష్టాలు మొదలయ్యాయి. గ్రామ సచివాలయాల్లో ఎక్కడా కూడా ప్రజా సమస్యలపై అర్జీలు స్వీకరిస్తున్న దాఖలాలు కనిపించడం లేదు. మండల స్థాయిలో జరిగే స్పందనకు వెళ్లాలంటే అక్కడ ఎవరుంటారు, ఎవరికి అర్జీ ఇవ్వాలి, వాటిని అసలు పట్టించుకుంటారా..అనే నిరాశ నిస్పృహలకు ప్రజలకు గురవుతున్నారు. ఇలాంటి భావనతో అనేక మంది మండల కేంద్రానికి వెళ్లి సమస్యలు చెప్పుకోలేకపోతున్నారు. మండల కేంద్రాల్లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రధాన సమస్యలకు సరైన స్పందన రాకపోతే జిల్లా కలెక్టరేట్‌కు అవస్థల నడుమ ప్రజలు పరుగులు తీసి వారి సమస్యలను నివేదించుకోవాల్సి వస్తోంది. ఇంతవరకు కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసింది ఏమీ లేదు. దీంతో గ్రామస్థాయిలో స్పందన నిర్వహిస్తే కోకొల్లలుగా సమస్యలపై అర్జీలు వస్తాయనే భావనతోనే సచివాలయాల్లో స్పందనకు స్వస్తి పలికారనే విమర్శలు వినిపిస్తున్నాయి. రేషన్‌కార్డులు, కొత్త పింఛన్లకు దరఖాస్తులు, జీవనాధార సంబంధమైన మౌలిక సదుపాయాల కల్పన, తదితర సమస్యలపై అర్జీలు అధికంగా వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నందున సచివాలయ స్పందనకు మంగళం పాడారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.


ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు



మండల కేంద్రంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు గ్రామీణ ప్రాంతాలనుంచి వచ్చి తమ సమస్యలను విన్నవించుకునేందుకు వృద్ధులు, దివ్యాంగులు మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా గ్రామస్థాయిలోనే గ్రామ సచివాలయాల్లో స్పందన కార్యక్రమం నిర్వహిస్తే అందరికీ ఉపయుక్తంగా ఉంటుంది.

– కల్లూరి జనార్దన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ, సీతారామపురం


సచివాలయాల్లో స్పందన కొనసాగించాలి



గత ప్రభుత్వ హయాంలో గ్రామ సచివాలయాల్లో ప్రతిరోజూ స్పందన కార్యక్రమాన్ని నిర్వహించే వారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి పరిష్కరించే వారు. ప్రస్తుతం స్పందన కార్యక్రమాన్ని నిలిపివేయడంతో మండలాధికారుల వద్దకు పరుగులు తీయాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామస్థాయిలోనే సమస్యలు పరిష్కరించుకునేలా సచివాలయాల్లో స్పందన కార్యక్రమాన్ని కొనసాగించాలి.

–పోరుమామిళ్ల చినకాశయ్య, పబ్బులేటిపల్లి

సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండాలి



సచివాలయాల్లో స్పందన కోసం ప్రత్యేకంగా కౌంటర్ అంటూ ఏదీ లేదు. ప్రతి సోమవారం గ్రామ సచివాలయాల్లో సిబ్బంది తప్పనిసరిగా ప్రజలకు అందుబాటులో ఉండాలి. అర్జీల రూపంలో వచ్చే ప్రజల సమస్యలను పరిష్కరించాలి. సిబ్బంది అందుబాటులో లేకుంటే ప్రజలు ఫిర్యాదు చేయొచ్చు.

– భార్గవి, ఈఓపీఆర్డీ, సీతారామపురం